



ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 333 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- శనివారం 05 జూలై 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ట్రంప్ సుంకాలకు మోదీ తలొగ్గుతారు..
## రాసి పెట్టుకోండి:రాహుల్

**జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** మూడు నెలల క్రితం భారత్ పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహుల్ పేర్కొన్నారు.



ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని.. తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు. అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. దీంతో అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# శేషాచలం అడవుల్లో
## పోలీసులపై ఎర్రచందనం స్మగ్లర్ల దాడి

**సుండుపల్లి, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** అన్నమయ్య జిల్లా శేషాచలం అడవుల్లో పోలీసులపై ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలు ఎదురుదాడికి దిగారు. సుండుపల్లి మండలం కావలి వద్ద ఉన్న డంపింగ్ కేంద్రం నుంచి ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేశారు.



ఈ క్రమంలో స్మగ్లర్లు ఎదురుదాడి చేసి పరారయ్యారు. వారిలో తమిళనాడుకు చెందిన గోవిందన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.80 లక్షల విలువైన 26 దుంగలు.. 2 కత్తులు, 2 గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. పరారైన మరో 10 మంది ఎర్రచందనం కూలీల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు అదనపు ఎస్పీ వెంకటాద్రి వెల్లడించారు.

# తిరుమలలో జులై 15, 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు:తితిదే




**తిరుమల, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** ఈ నెల 15, 16 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) రద్దు చేసింది. శ్రీవారి ఆలయంలో జులై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, జులై 16న ఆణివార ఆస్థానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలోనే వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటన విడుదల చేసింది. జులై 14, 15 తేదీల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించబోమని ప్రకటనలో పేర్కొంది.

# సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్త:సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత అంశంపై హైదరాబాద్లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఆత్మహత్యకు పాల్పడిన
## ఆదిత్య ఫార్మసీ ఎండీ నరసింహమూర్తిరాజు



**విజయవాడ, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** ఆదిత్య ఫార్మసీ ఎండీ నరసింహమూర్తిరాజు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయోధ్యనగర్ క్షత్రియభవన్లో ఆయన బలవన్మరణానికి పాల్పడినట్టు గుర్తించారు. గతేడాది స్నేహితుడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న నరసింహమూర్తిరాజు.. ఇటీవలే బెయిల్పై బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన అనూహ్యంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. ఆత్మహత్యకుగల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# 20ఏళ్ల తర్వాత.. ఒకే వేదికపై ఠాక్రే సోదరులు

**ముంబయి, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** విడిపోయిన అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ఠాక్రేలు దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికను పంచుకున్నారు. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంతో ఇది ప్రతిపక్షాల విజయంగా పేర్కొంటూ.. నేడు ముంబయి వేదికగా 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన నేత రాజ్ ఠాక్రేలు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఛత్రపతి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారనుంది.



ఈ కార్యక్రమంలో రాజ్ ఠాక్రే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం ద్వారా మన పిల్లలు సరైన విషయాలు నేర్చుకొనే అవకాశం లేకుండా పోతోందని మోదీ ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. దక్షిణ భారతదేశంలో ఎందరో సినీనటులు, రాజకీయ నాయకులు ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నప్పటికీ తమ మాతృభాషలైన తెలుగు, తమిళం వంటి భాషల విషయంలో ఎంతో గర్వంగా ఉంటారన్నారు. అలాగే మహారాష్ట్ర నేతలకు, ప్రజలకు కూడా తమ భాషపై అభిమానం ఉంటుందని పేర్కొన్నారు. తమకు హిందీ భాషపై వ్యతిరేకత ఎప్పుడూ లేదని రాజ్ అన్నారు. అయితే ఇతరులపై ఆ భాషను బలవంతంగా రుద్దాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ పూర్వీకులు మరాఠా సామాజాన్ని ఎన్ని ప్రాంతాలకు విస్తరించినప్పటికీ ఎప్పుడూ అక్కడి వారిపై మరాఠీని బలవంతంగా రుద్దలేదని రాజ్ పేర్కొన్నారు. కానీ కేంద్రప్రభుత్వం మాత్రం ఇతర రాష్ట్రాలపై త్రిభాషా సూత్రాన్ని ప్రయోగించాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికీ దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు, ఇతర హైకోర్టులలో అన్ని ఉత్తర్వులు ఆంగ్లభాషలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని ఈ విధానాన్ని మహారాష్ట్రపై రుద్దాలని చూస్తే.. ఏం జరుగుతుందో ఇప్పటికైనా కేంద్రం తెలుసుకోవాలని హెచ్చరించారు. తమను ఒకచోట చేర్చడం ఎవరికీ సాధ్యం కాలేదని.. చివరికి బాల్ ఠాక్రే సైతం చేయలేకపోయిన పనిని.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ రాష్ట్రానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా చేశారని రాజ్ ఠాక్రే అన్నారు. అనుకోకుండానే ఆయన తమని ఒకే వేదిక పైకి తీసుకువచ్చారని అన్నారు. ఇకపై రాష్ట్ర ఐక్యత విషయంలో తాము ఎప్పటికీ ఒక్కటిగా ఉంటామని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ విసిరిన సవాల్
## కేటీఆర్కు అర్థం కానట్టుంది:మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి విసిరిన సవాల్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్కు అర్థం కానట్టుందని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరింది కేటీఆర్కు కాదని.. కేసీఆర్కు అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత హోదా ఉన్న కేసీఆర్ చర్చకు రావాలన్నారు. భారత రాష్ట్ర సమితి ఇప్పటికే చచ్చిపోయిందని.. కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లెలే అంగీకరించడం లేదన్నారు. కేటీఆర్ తమ నాయకుడే కాదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారని సీతక్క పేర్కొన్నారు.

# అప్పుడేమో 90 డిగ్రీల వంతెన..
## ఇప్పుడు పాములా మెలికలు తిరిగిన మరో వంతెన

**జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** మధ్యప్రదేశ్లోని భోపాల్లో ఇటీవల 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అంతలోనే అక్కడికి దగ్గర్లోని సుభాష్నగర్లో నిర్మించిన పాములా మెలికలు తిరిగిన రైల్వే ఓవర్ బ్రిడ్జి సోషల్ మీడియాలో వైరల్గా మారింది. దాని నిర్మాణంలో ఇంజినీరింగ్ వైఫల్యం కారణంగా ఎనిమిది గంటల్లో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. రూ.40 కోట్లతో దీనిని నిర్మించినట్లు తెలుస్తోంది. భోపాల్ రైల్వే స్టేషన్కు వెళ్లే ప్రయాణికులు ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఈ వంతెన వల్ల సుభాష్ నగర్ ప్రాంతంలో రద్దీ తగ్గినప్పటికీ దాని నిర్మాణం పలుచోట్ల మెలికలు తిరిగి ఉండడం వల్ల కొన్ని సెకన్లలోనే పలుమార్లు మలుపులు తీసుకోవాల్సి వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. దీనివల్ల రాత్రి సమయాల్లో, అధిక వేగంతో ప్రయాణించే వాహనదారులు మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి.. ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో కారు రోడ్డు డివైడర్ను ఢీకొట్టి గాలిలో పల్టీలు కొట్టిందని.. మరోసారి ఓ స్కూల్ వ్యాన్ డివైడర్ను ఢీకొట్టడంతో అందులోని విద్యార్థులకు గాయాలయ్యాయన్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా వెంటనే తగిన చర్యలు తీసుకొని.. మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజధాని భోపాల్లో ఐష్బాగ్ వద్ద రూ.18 కోట్లతో ఇటీవల కొత్తగా ఓ రైల్వే వంతెన నిర్మించారు. అయితే, అది 90 డిగ్రీల మలుపు కలిగిఉండటం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇలాంటి డిజైన్లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు దుయ్యబట్టారు. నిర్మాణ సంస్థ మాత్రం ఆ డిజైన్ ను సమర్థించుకుంది. సమీపంలో మెట్రో రైల్వేషన్, భూమి కొరత దృష్ట్యా ఇలా నిర్మించడం తప్ప మరో మార్గం లేదని వివరణ ఇచ్చింది. కొంచెం అదనపు భూమి అందుబాటులో ఉంటే ఆ మార్గం సవ్యంగానే ఉండేదని చెప్పింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఏడుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు విధించింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్పై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. వంతెన పునరుద్ధరణ కోసం ఓ కమిటీని సైతం ఏర్పాటుచేసినట్లు ముఖ్యమంత్రి మోహన్యాదవ్ వెల్లడించారు.



# వరుసగా ఢీకొన్న ఐదు బస్సులు..
## అమరనాథ్ యాత్రలో ప్రమాదం

**జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** అమర్నాథ్ యాత్రికులు వెళ్తున్న బస్సులకు ప్రమాదం జరిగింది. వరుసగా ఒకదానినొకటి ఐదు బస్సులు ఢీకొనడంతో 36 మంది యాత్రికులు గాయపడ్డారు. జమ్మూకశ్మీర్లోని రాంబన్ జిల్లా చందర్కోట్ వద్ద పహల్గాం బేస్ క్యాంప్నకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను రాంబన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



యాత్రికులు అల్పాహారం చేయడం కోసం చందర్కోట్ వద్ద వాహనాలు నిలిపిఉంచారు. అప్పుడే ఒక బస్సు నియంత్రణ కోల్పోయి, ఆగిఉన్న వాటిని ఢీకొట్టింది. దాంతో వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో యాత్రికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగినప్పటికీ బాధితుల్లో ఎక్కువమంది యాత్రను కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని రాంబన్ పోలీసు ఉన్నతాధికారి కుల్బీర్ సింగ్ వెల్లడించారు. అయితే కొందరికి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు ఆగిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇక దెబ్బతిన్న బస్సులను మార్చడంతో యాత్ర ప్రారంభమైనట్లు చెప్పారు. జులై 3 నుంచి అమర్నాథ్ యాత్ర ప్రారంభమైంది. కట్టుదిట్టమైన భద్రత మధ్య 5,880 మందికి పైగా భక్తుల తొలి బ్యాచ్ బుధవారం జమ్ము నుంచి బయల్దేరింది. సాధారణంగా యాత్రికులు పహల్గాం మార్గంతో పాటు బాల్తాల్ మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ రెండు మార్గాలను ఇప్పటికే 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి భద్రతను మరింత పటిష్ఠం చేసినట్లు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు.

# చిన్నారుల కలల సాకారానికి
## అండగా నిలుస్తాం:మంత్రి లోకేశ్

**అమరావతి, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్):** తమకు చదువు చెప్పించాలంటూ నెల్లూరు కమిషనర్కు ఇద్దరు చిన్నారులు విజ్ఞప్తి చేయడంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. చదువు కోసం కమిషనర్ను చిన్నారులు ప్రాధేయపడటం కలచివేసిందన్నారు.



'ఓ సారూ.. మాకూ చదువు చెబుతారా?' అంటూ ఇద్దరు చిన్నారులపై ఈటీవీ భారత్లో వచ్చిన కథనంపై నారా లోకేశ్ స్పందించారు. చిన్నారులు పెంచలయ్య, వెంకటేశ్వర్ల చదువుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పేదరికం నుంచి బయటకు తెచ్చే ఒకే ఒక్క సాధనం విద్య అని, చిన్నారులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అండగా నిలుస్తామని అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# కళ్లు చెదిరేలా 'రామాయణ'

## బడ్జెట్.. రూ.1500 కోట్లు పైమాటే!



ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న 'రామాయణ' సినిమాకు సంబంధించి గ్లింప్స్ తాజాగా విడుదలైన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటినుంచి ఇది భారీ స్థాయిలో రానుందని వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ గ్లింప్స్ విడుదలైన తర్వాత ఆ వార్తల జోరు పెరిగింది. ఈ ప్రాజెక్ట్ రూ.835 కోట్లతో రానుందని టాక్ వినిపించింది. తాజాగా బాలీవుడ్ మీడియాలో ఈ సినిమా రెండు భాగాల బడ్జెట్ను వివరిస్తూ కొన్ని కథనాలు వచ్చాయి. ప్రస్తుతం అవి వైరల్ అవుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా రానున్న సినిమా బడ్జెట్ రూ.1600 కోట్లని.. మొదటి భాగం రూ.900 కోట్లతో రానుందని.. రెండోది రూ.700 కోట్లని సమాచారం. దీనికోసం మేకర్స్ ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించారట. మొదటి భాగం కోసం ఎక్కువ సెట్స్ వేస్తారని అందుకే పార్ట్2 కంటే దాని బడ్జెట్ ఎక్కువని హిందీ మీడియా తెలిపింది. రెండో భాగంలో కేవలం యాక్షన్ సన్నివేశాలు మాత్రమే మిగిలి ఉంటుందట. 'మల్హోత్రా టీమ్ ఈ సినిమాను ఎంతో భారీగా ప్లాన్ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ముఖ్యంగా నేటితరానికి రామాయణాన్ని అందించాలనే ఆలోచనతో ముందుకుసాగుతోంది. తన పెట్టుబడులు మొత్తం తిరిగి పొందగలరని లాభాలను కూడా ఆర్జించగలమని నమ్మకంగా ఉంది. విజువల్ వండర్గా ఇది రానుంది' అని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ బడ్జెట్ నిజమైతే అత్యంత ఖరీదైన భారతీయ చిత్రంగా 'రామాయణ' చరిత్ర సృష్టిస్తుంది. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా మొదటి పార్ట్ షూటింగ్ పూర్తయింది. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రంలో రాముడి పాత్రలో రణ్బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.

రిపబ్లిక్ సినిమా CINEMA

# దివాలా రూమర్స్.. స్పందించిన రకుల్ భర్త జాకీ భగ్నానీ



బాలీవుడ్ నటులు అక్షయ్కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బడే మియా.. ఛోటే మియా'. భారీ తారాగణంతో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా నిర్మాత, రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ వార్తలు వచ్చాయి. తాజాగా వాటి గురించి జాకీ మాట్లాడారు. ఈ విషయంలో ఎవరినీ నిందించాలని అనుకోవడం లేదన్నారు. "ఈ సినిమా కోసం తనఖా పెట్టిన జూహు కార్యాలయాన్ని తిరిగి సొంతం చేసుకున్నాను. వార్తల్లో నిలిచిన భవనం అదే. నేను దివాలా తీయడం వల్ల దాన్ని అమ్మేయాల్సి వచ్చిందని, నావద్ద ఆహారం కొనడానికి కూడా డబ్బు లేదని ఎన్నో వార్తలు ప్రచారమయ్యాయి. నేను పారిపోయానని కూడా ప్రచారం జరిగింది. ఈ రూమర్స్ విషయంలో నేను ఎవరినీ నిందించాలని అనుకోవడం లేదు. అసలు ఇవి ఎక్కడ ప్రారంభమయ్యాయో కూడా నాకు తెలియడం లేదు" అని జాకీ చెప్పారు. 'బడే మియా.. ఛోటే మియా' విషయంలో దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్కు అవకాశం ఇచ్చి తప్పు చేశానని అన్నారు. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ గా 'బడే మియా.. ఛోటే మియా' సిద్ధమైంది. అలీ అబ్బాస్ జాఫర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. పృథ్వీరాజ్ సుకుమారన్, మానుషి చిల్లర్, అలయ ఎఫ్, సోనాక్షి సిన్హా కీలక పాత్రల్లో నటించారు. సుమారు రూ.350 కోట్ల బడ్జెట్తో రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.102 కోట్లు మాత్రమే వసూలుచేసింది. ఇక ఈ సినిమా కోసం తన ఆస్తులు తనఖా పెట్టినట్లు కూడా జాకీ గతంలో చెప్పిన విషయం తెలిసిందే. తమ బాధ ఎవరికీ పట్టదని వ్యాఖ్యలు చేశారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1811:** వెనెజులా స్వాతంత్ర దినోత్సవం (దక్షిణ అమెరికాలో స్వాతంత్రం (స్పెయిన్ నుంచి) పొందిన మొట్టమొదటి దేశం).
- **1916:** భారతదేశ 7వ రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ జననం (మ.1994).
- **1927:** తెలుగు రచయిత, జ్ఞానపీఠ బహుమతి గ్రహీత రావూరి భరద్వాజ జననం (మ.2013)..(చిత్రంలో)
- **1946:** 'బికిని' ఈత దుస్తులు మొదటిసారిగా పారిస్ ఫ్యాషన్ ప్రదర్శనలో కనిపించాయి.
- **1947:** భారతదేశానికి స్వాతంత్ర్యాన్నిచ్చే చట్టం బ్రిటిషు పార్లమెంటులో ప్రవేశపెట్టారు.
- **1954:** ఆంధ్ర రాష్ట్ర హైకోర్టును నెలకొల్పారు.
- **1962:** అల్జీరియా స్వాతంత్ర్యదినోత్సవం.
- **1975:** కేప్ వెర్డె స్వాతంత్ర్య దినోత్సవం. (500 సంవత్సరాల పోర్చుగీస్ వలస పాలన తర్వాత)
- **1996:** డాలి అనే పేరు గల గొర్రె పిల్లను, క్లోనింగ్ అనే పద్ధతి ద్వారా పెద్ద గొర్రె నుంచి తీసిన జీవకణం ద్వారా పుట్టించారు.



వెనెజులా స్వాతంత్ర దినోత్సవం



జ్ఞాని జైల్ సింగ్




రావూరి భరద్వాజ



'బికిని' ఈత దుస్తుల పారిస్ ఫ్యాషన్ ప్రదర్శన



బ్రిటీషు పార్లమెంటు




ఆంధ్రరాష్ట్ర హైకోర్టు



అల్జీరియా స్వాతంత్ర్యదినోత్సవం



కేప్ వెర్డె స్వాతంత్ర్య దినోత్సవం



డాలి

# కన్నడపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా.. కమల్కు కోర్టు మధ్యంతర ఉత్తర్వులు




కన్నడ భాషపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయకుండా బెంగళూరు కోర్టు నటుడు కమల్ హాసన్కు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన అనంతరం వీటిని జారీ చేసింది. కన్నడకు వ్యతిరేకంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండా నిషేధం విధించాలని ఆయన పిటిషన్ వేశారు. దీన్ని బెంగళూరు కోర్టు శుక్రవారం విచారించింది. "కన్నడపై భాషాపరమైన ఆధిపత్యాన్ని ప్రకటించేలా వ్యాఖ్యలు చేయకూడదు. దీనిపై ఎలాంటి పోస్ట్ పెట్టకూడదు. కన్నడ భాష, సాహిత్యం, సంస్కృతికి వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటనలు చేయకూడదు" అని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ ఆగస్టు 30కి వాయిదా వేసింది. ఆరోజు కమల్ హాసన్ కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించింది. చెన్నైలో జరిగిన 'థగ్ లైఫ్' ఈవెంట్లో శివరాజ్కుమార్ను ఉద్దేశిస్తూ కమల్ హాసన్ మాట్లాడారు. 'ఇక్కడ నాకు కుటుంబం ఉంది. అందుకే వచ్చాను. మీ భాష (కన్నడ) కూడా తమిళం నుంచే పుట్టింది' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. మరోవైపు ఆయన నటించిన 'థగ్ లైఫ్' తాజాగా నెటిక్స్లో అందుబాటులోకి వచ్చింది. కన్నడలోనూ ఇది స్ట్రీమింగ్ అవుతోంది.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

# క్రిమినల్స్ను పెట్టి చంపాలనుకున్నాడు.. షమీపై మాజీ భార్య సంచలన ఆరోపణలు



టీమ్ ఇండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమీపై అతడి మాజీ భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేశారు. అతడికి వ్యక్తిత్వం లేదని, క్రూరమైన మనస్తత్వంతో తనను ఎంతగానో వేధించాడని ఆమె ఆరోపించారు. వీరి విడాకుల కేసుకు సంబంధించి ఇటీవల కలకత్తా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో షమీని విమర్శిస్తూ హసీన్ జహాన్ ఇన్స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ చేశారు. "గత ఏడేళ్లుగా మన మధ్య న్యాయపోరాటం జరుగుతోంది. నీ క్యారెక్టర్ లేనితనం, దురాశ, క్రూరమైన మనస్తత్వంతో సొంత కుటుంబాన్నే చేజేతులా నాశనం చేశావ్. మమ్మల్ని చంపడానికి, మా పరువు తీసి వేధించడానికి, నన్ను ఓడించడానికి నువ్వు ఎంతమంది క్రిమినల్స్కు డబ్బు ఇచ్చి ఉంటావ్. దానివల్ల నువ్వు ఏమైనా సాధించావా? క్రిమినల్స్, వేశ్యలకు నువ్వు ఇచ్చిన డబ్బును.. మన కుమార్తె చదువు కోసం వెచ్చించి ఉంటే, మన భవిష్యత్తు కోసం ఉపయోగించి ఉంటే ఇప్పుడు మన జీవితం ఎంతో బాగుండేది. మనమంతా ఎంతో మర్యాదగా జీవించేవాళ్లం" అని హసీన్ జహాన్ రాసుకొచ్చారు. "నాకు ఆ భగవంతుడు ఎంత ధైర్యాన్ని, సహనాన్ని ఇచ్చాడో చూడు. నిజం కోసం నేను ఏళ్లతరబడి పోరాడుతూనే ఉన్నాను... ఉంటాను కూడా. అందుకే, నువ్వు ఎంతమంది క్రిమినల్స్తో చేతులు కలిపినా నన్ను ఏమీ చేయలేకపోతున్నావ్. ఈ పురుషాధిక్య సమాజంలో నాపై నిందలేసి నువ్వు మద్దతు కూడగట్టుకోగలవేమో..! కానీ, ఏదో ఒకరోజు నీకు కూడా కష్టకాలం మొదలవుతుంది. అప్పుడు నీకు అండగా నిలిచినవాళ్లే నిన్ను తరిమేస్తారు. చట్టంపై నాకు నమ్మకం ఉంది" అని షమీని ఆమె దుయ్యబట్టారు. 2014లో హసీన్ షమీకి వివాహమైంది. వీరికి కుమార్తె జన్మించింది. అయితే, ఆ తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. 2018లో హసీన్ అతడిపై గృహహింస కేసు పెట్టింది. దీనిపై కొన్నేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల హసీన్, ఆమె కుమార్తె సంరక్షణ కోసం రూ.4 లక్షలను భరణం కింద చెల్లించాలని షమీని కలకత్తా హైకోర్టు ఆదేశించింది.

# ఇంటి చిట్కాలు

## ఇప్పుడు చెప్పే వాటిలో ఏ ఒక్కటి వాడినా చాలు కరివేపాకు మొక్క ఏపుగా, గుబురుగా పెరుగుతుంది, ఆకులతో పచ్చగా కళకళలాడుతుంది

ఈ రోజుల్లో చాలా మంది గార్డెనింగ్ ఇష్టపడుతున్నారు. చాలా మంది తమ ఇళ్లల్లో లేదా పెరట్లో కరివేపాకు మొక్కను పెంచుకుంటారు. అయితే, కొన్ని సార్లు మొక్క సరిగ్గా పెరగదు. అలాంటి మొక్కకు కొన్ని సహజ ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుంది.

కరివేపాకు.. వంటల్లో ఎక్కువగా వాడతారు. కరివేపాకు రుచిని అందించడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇక, చాలా మంది ఇంట్లో కరివేపాకు మొక్కను పెంచుకుంటారు. కూరల్లోకి అవసరమైనప్పుడల్లా పెరట్లోకి వెళ్లి కరివేపాకు తెంచి.. వాడుతుంటారు. కరివేపాకు మొక్కలను పెరట్లో, కుండీల్లో సులభంగా పెంచుకోవచ్చు. వీటికి తగినంత సూర్యరశ్మి, క్రమం తప్పకుండా నీరు అవసరం. నీరు నిలవకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు కత్తిరించడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది. అయితే, కొన్ని కారణాల వల్ల కరివేపాకు మొక్కలు సరిగ్గా పెరగవు. లేదంటే ఆకులు చిన్నవిగా, పసుపు రంగులోకి మారతాయి. మీ ఇంట్లో పెంచుకునే మొక్కకు కూడా ఇలాంటి సమస్యలు ఉంటే నో టెన్షన్. ఇప్పుడు చెప్పే కొన్ని సహజ ఎరువులతో కరివేపాకు దట్టంగా, పచ్చగా మారుతుంది. ఆ ఎరువుల్ని ఇంట్లోనే చేసుకోవచ్చు. పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.





### కరివేపాకు మొక్కకు ఎరువులు ఎందుకు అవసరం?



ఇంట్లో ఒక్కసారి కరివేపాకు మొక్క నాటితే.. అది ఏళ్ల పాటు ఆకులు ఇస్తుంది. కానీ దానికి సరైన పోషకాలు అందకపోతే మొక్క బలహీనంగా మారుతుంది. దీంతో మొక్క ఎండిపోవడం జరుగుతుంది. అందుకే కరివేపాకు మొక్కకు మంచి ఎరువులు ఇవ్వాలి. సహజ ఎరువులు మొక్క వేర్లను బలపేతం చేస్తాయి. ఆకుల్ని పచ్చగా ఉంచుతాయి. అంతేకాకుండా కొత్త కొమ్మల పెరుగుదలకు సాయపడతాయి. రసాయన ఎరువులకు బదులుగా సహజ ఎరువులు వాడటం వల్ల మొక్క చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉంటుంది. ఇంట్లోనే చేసుకోగల సహజ ఎరువులేంటో ఇప్పుడు చుద్దాం.

### అరటి తొక్క కంపోస్ట్

అరటి తొక్కల్లో మొక్కల పెరుగుదలకు అవసరమైన పొటాషియం, భాస్వరం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. అందుకే అరటి తొక్కలతో కంపోస్ట్ ఎరువు తయారు చేయవచ్చు. ఇందుకోసం 2-3 అరటి తొక్కలను చిన్న ముక్కలుగా కోయండి. వాటిని నీటితో నిండిన పాత్రలో 2-3 రోజులు నానబెట్టండి. ఈ నీటిని వడకట్టి మొక్క వేర్లలో పోయాలి. కావాలనుకుంటే మీరు అరటి తొక్కల్ని ఎండబెట్టి గ్రైండ్ చేసి మట్టిలో కలపవచ్చు.

### గుడ్డు పెంకు



గుడ్డు పెంకుల్లో కాల్షియం కార్బోనేట్ ఉంటుంది. ఇది మొక్కను బలంగా చేస్తుంది. అందుకే కరివేపాకు మొక్కకు గుడ్డు పెంకులు మంచి ఆప్షన్. ఇందుకోసం 4-5 గుడ్ల పెంకుల్ని తీసుకోండి. వాటిని ఎండలో బాగా ఎండబెట్టండి. ఆ తర్వాత మెత్తటి పొడిలా దంచుకోండి. ఈ పొడిని మొక్క మట్టిలో కలపండి. ఇది మొక్కను వేరు తెగులు నుంచి కాపాడుతుంది. ఆకుల్ని పచ్చగా ఉంచుతుంది.

### ఎప్సమ్ సాల్ట్ సొల్యూషన్



ఎప్సమ్ సాల్ట్ మొక్కను పచ్చగా మార్చడానికి సాయపడుతుంది. ఇందుకోసం ఒక లీటర్ నీటిని తీసుకోండి. ఆ తర్వాత ఒక టేబుల్ స్పూన్ ఎప్సమ్ సాల్ట్ ఆ నీటిలో కరిగించండి. ఈ ద్రావణాన్ని ఒక స్ప్రే బాటిల్లోకి తీసుకోండి. దీనిని మొక్కపై పిచికారీ చేయండి. నెలకు ఒకసారి మాత్రమే ఈ సొల్యూషన్ వాడండి. ఇది మొక్క ఆకుల్ని మెరిసేలా, దట్టంగా ఉండేలా చేస్తుంది.

### బెల్లం, మజ్జిగ ఎరువు



ఈ రెండు కూడా మొక్క పెరుగుదలకు సాయపడతాయి. బెల్లం, మజ్జిగలో ఉండే బ్యాక్టీరియా నేలను సారవంతం చేస్తుంది. ఇందుకోసం ఒక లీటర్ నీటిని తీసుకోండి. ఆ నీటిలో ఒక టీ స్పూన్ బెల్లం, ఒక కప్పు మజ్జిగ కలపండి. ఈ మిశ్రమాన్ని నాలుగు నుంచి ఐదు రోజుల పాటు పులియబెట్టండి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని నీటిలో కలుపుకోండి. ఈ మిశ్రమాన్ని మొక్కపై పిచికారీ చేయండి. లేదంటే మొక్క వేర్లలో ఈ నీటి మిశ్రమాన్ని పోయండి. దీంతో.. మొక్క నేల సారవంతంగా మారి.. బాగా పెరుగుతుంది.

### వేప కేక్



వేప పిండిలో ఎన్నో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇది మొక్కను కీటకాల నుంచి రక్షిస్తుంది. అంతేకాకుండా తగిన పోషణను అందిస్తుంది. ఇందుకోసం వేప పిండిని నీటిలో నానబెట్టండి. ఈ మిశ్రమాన్ని రెండు రోజులు అలాగే ఉంచండి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండండి. ఈ నీటిలో ఫిల్టర్ చేసి మొక్కకు పోయాలి. ఇది మొక్కను శిలీంధ్రాలు, కీటకాల నుంచి రక్షిస్తుంది. దీంతో మొక్క ఏపుగా పెరుగుతుంది.



**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించడం జరిగింది.